క్లుప్తంగా

12 నుంచి తపాలా ఉద్యోగుల సమ్మె

కె.గంగవరం: ఈ నెల 12 నుండి జరగబోయే అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని రామచంద్రపురం బ్రాంచ్ గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం కార్యదర్శి ఎస్‌వీవీ మునీశ్వరరావు కోరారు. మండల పరిధిలోని పామర్రు, కె.గంగవరం సబ్ పోస్టాఫీసుల్లో ఆయన పర్యటించి ఉద్యోగులకు సమ్మె ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలని, 8గంటల పని విధానం కల్పించాలని, 12,24,36 సర్వీస్ గల ఉద్యోగులకు ఆదనపు ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. శుక్రవారం మధ్యాహ్నం రామచంద్రపురంలోని వెలికాని రామారావు మెమోరియల్ హాల్‌లో దీనిపై సభ నిర్వహిస్తున్నామన్నారు.

యూటీఎఫ్ నిరసన

రామచంద్రపురం: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్య పరిష్కారానికి యూటీఎఫ్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ పట్టణ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి ఈశ్వరరావు, పీఎస్‌వీ రమణ, జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ నిరసనలు చేశారు.

విద్యార్థులకు దంత పరీక్షలు



విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో బీఆర్ అంబేడ్కర్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో ద్రాక్షారామకు చెందిన బీవీశ్వర దంత వైద్యశాల వైద్యుడు డాక్టర్ బద్దు క్రాంతికుమార్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా దంత సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం వైద్యులు డాక్టర్ క్రాంతికుమార్, డాక్టర్ నున్న శ్రావణ్‌కుమార్ 534 మంది విద్యార్థులను పరిశీలించారు. వీరిలో 40 మందికి దంత సమస్యలు గుర్తించి వారికి మందులు అందజేశారు. ప్రిన్సిపాల్ ఎన్‌వీ నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్ శేఖర్, సూపరింటెండెంట్ బదురు రాజశేఖర్, గురుకుల పాఠశాల వైద్యుడు డాక్టర్ ఎం.ఆర్.రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ కాశీ విశ్వనాథ షిరిడీ సాయి మందిర వార్షికోత్సవం



షిరిడి సాయికి ప్రత్యేక హారతులు

రామచంద్రపురం: పట్టణంలో వేంచేసియున్న శ్రీ కాశీ విశ్వనాథ షిరిడి సాయి మందిర 11వ వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. పలువురు వ్యాపారవేత్తలు సాయిబాబాను దర్శించారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. మందిర వార్షికోత్సవం పురస్కరించుకుని నవంబర్ 30 నుంచి షిరిడి సాయిబాబా సందేశ సప్తాహం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సామూహిక సాయి సత్యవ్రతం, చందనోత్సవం, అభిషేకాలు నిర్వహించారు. సుమారు రెండు వేల మందికి అన్న సమారాధన చేశారు.

ఉల్లాసంగా కార్తిక వన భోజనాలు



వెలంపాలెం దేవతీలకుల వనభోజనాల్లో ప్రజాప్రతినిధులు, దేవతలకుల కుటుంబికులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెం బ్రహ్మగుండం వద్ద లక్ష్మీ నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో దేవతలకుల కార్తిక వన సమారాధన కమిటీ ఆధ్వర్యంలో గురువారం కార్తిక వన భోజనాల కార్యక్రమం ఉల్లాసపూరిత వాతావరణంలో నిర్వహించారు. ముందుగా కార్తిక దామోదర పూజ నిర్వహించి అనంతరం భోజనాల కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ తుమ్మూరి సుబ్బలక్ష్మి, ఎంపీపీ అంబటి భవాని, ద్రాక్షారామ, వెంకటాయపాలెం సర్పంచ్‌లు చెక్కపల్లి అరుణ, యడ్ల మిల్లి సతీష్‌కుమార్, ద్రాక్షారామతో పాటు వివిధ జిల్లాల నుండి పెద్ద ఎత్తున దేవతలకుల కుటుంబీకులు పాల్గొన్నారు.

మగ్గం, జర్దోసీపై ఉచిత శిక్షణ

అమలాపురం టౌన్: మహిళలకు స్వయం ఉపాధి కోసం శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో స్థానిక శ్రీసత్యసాయి కల్యాణ మండపంలో 37 రోజుల పాటు మగ్గం, జర్దోసీపై అందించిన ఉచిత శిక్షణ గురువారంతో ముగిసింది. అమలాపురం పట్టణం, పరిసర గ్రామాలకు చెందిన 75 మంది మహిళలు శిక్షణ పొందారు. మహిళలు స్వయం ఉపాధి దిశగా అడుగులేయాలన్న సంకల్పంతో శిక్షణ అందించామని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు ఉడాల వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమం ముగింపు సభకు మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనూరాధ హాజరవుతారని చెప్పారు. శిక్షణకు ఉపాధి విడివిలిసత్యసాయి సంస్థల కోఆర్డినేటర్ డాక్టర్ జి.ప్రభాకర్, భక్తులు సహకారం అందించారు.

చివరిలో నష్టం

- తెరిపిచ్చిన తుపాను
- తేరుకుంటున్న రైతాంగం
- వ్యవసాయ క్షేత్రాల నుంచి ధాన్యం తరలింపు
- నష్టం అంచనా వేస్తున్న అధికారులు
- 45,706 ఎకరాల్లో కోతలు పూర్తి



అంగరలో ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులతో ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి

కపిలేశ్వరపురం: మిచాంగ్ తుపాను తీరం దాటింది. వాతావరణం తెరిపివ్వడంతో రైతాంగం వ్యవసాయ క్షేత్రాల బాట పట్టారు. బరకాలు కప్పి ఉంచుకున్న ధాన్యాన్ని తెరిచి గట్లపైకి తరలించుకున్నారు. రహదారులపై ఆరబెట్టుకుని పంటను పరిరక్షించుకునే పనుల్లో నిమగ్నమయ్యారు. పంట కోత కోయని చేలో నిలిచిన నీటిని గాడులు తీసి బయటకు పంపారు. పంటను రక్షించుకునేందుకు అధికారుల సూచనలు పాటిస్తున్నారు.

పొలం బాట పట్టిన అధికారులు

వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు, సిబ్బంది పంట పొలాల్లో పర్యటిస్తున్నారు. నష్టాన్ని అంచనా వేస్తున్నారు. రైతుకు వెన్నంటి నిలిచారు. రాజంగా తహసీల్దార్ కొమరం సూర్యారావు, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ఏఓ కేవీఎస్ రమేష్‌కుమార్, గ్రామాల వీఆర్వోలు, ఆర్బీకేల వ్యవసాయ సహాయకులు క్షేత్ర స్థాయిలో సేవలందించారు. మండపేట ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ కురుపూడి భవాని, సర్పంచ్ పిల్లా అరవారాజు, ఎంపీటీసీ అద్దాల రాములు, ఏఎంసీ డైరెక్టర్ తమ్మ వీరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్ పాలతోడు గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి రైతులతో చర్చించారు. ధాన్యాన్ని పరిశీలించి పరిస్థితిపై వ్యవసాయాధికారులతో మాట్లాడారు.

నష్టం అంచనాలో అధికారులు

అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం మండపేట నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 46,633 ఎకరాల్లో వరిని సాగు చేయగా 45,706 ఎకరాల్లో తుపానుకు ముందే కోతలు పూర్తయ్యాయి. సుమారు 1,120 ఎకరాల్లోని 2800 టన్నుల ధాన్యం వ్యవసాయ క్షేత్రాల్లోనూ, సమీప గట్లపైనా బరకాలతో కప్పి ఉంచుకున్నారు. ఎడతెరిపని వర్షంతో దాదాపు ఎక్కువ భాగం నీట మునిగింది. గురువారం ఆ ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునేందుకు అవస్థలు పడ్డారు. 927 ఎకరాల్లోని పంట కోయకుండా ఉంది. నీరు వీడకా పరిస్థితిని బట్టి నష్టాన్ని అంచనా వేయాల్సి ఉంటుందని వ్యవసాయాధికారులు తెలిపారు. మండలాల వారీగా సమీక్షించగా మండపేట మండలంలో 16,190 ఎకరాల్లో వరిసాగు చేయగా 15,555 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. అందులో 500 ఎకరాల్లోని సుమారు వెయ్యి టన్నుల ధాన్యం గట్లపై తడిసిపోయింది. 635 ఎకరాల్లోని పంట కోయకుండా ఉంది. రాయవరం మండలంలో 14,641 ఎకరాల్లో వరిసాగు చేయగా 14,445 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. అందులో 20 ఎకరాల్లోని సుమారు 100 టన్ను గట్లపై తడిసిపోయింది. 196 ఎకరాల్లోని పంట కోయకుండా ఉంది. కపిలేశ్వరపురం మండలంలో 15,802 ఎకరాల్లో వరిసాగు చేయగా 15,706 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. అందులో 600 ఎకరాల్లోని 1700 మెట్రిక్ టన్నులు ధాన్యం గట్లపై తడిసిపోయింది. 96 ఎకరాల్లోని పంట కోయకుండా ఉంది. రైతును ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, వ్యవసాయ క్షేత్రాల్లో వర్షపునీరు వీడగానే పూర్తి స్థాయి పరిశీలనతో ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్టు అధికారులు తెలిపారు.



అముజూరులో ధాన్యం ఆరబెడుతున్న రైతులు

వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం

కె.గంగవరం: మూడు రోజులుగా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు గురువారం తెరిపివ్వడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. రోడ్లపై, పంట పొలాల్లో, ఖాళీ స్థలాల్లో కప్పి ఉంచిన ధాన్యం రాసులను విప్పి రోడ్లపై ఆరబెడుతున్నారు. ప్రభుత్వం నిబంధనల సడలింపుతో తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించారు. మిగిలిన ధాన్యాన్ని ఆరుదల శాతం కోసం ఆరబెట్టారు. పామర్రు, భట్లపాలిక, కూళ్ల గ్రామాల్లో తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, వ్యవసాయశాఖాధికారి బలుసు రవి పర్యటించి ప్రతి గింజా కొనుగోలు చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కొన్నిచోట్ల దగ్గరుండి తడిసిపోయిన ధాన్యాన్ని రైతుల సహకారంతో మిల్లులకు పంపించారు. మండలంలో ప్రధాన కాలువలైన టేకి డ్రెయిన్, రాజుకాలువల వర్షపు నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాల్లో నిలిచిపోయిన నీటిని పంట కాలువల్లోకి మళ్లించేందుకు రైతులు ప్రయాసపడ్డారు.

ధాన్యం రాశులను పరిశీలించిన ఏఎంసీ చైర్మన్



లొల్లలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు

రాయవరం: లొల్ల గ్రామంలో తడిసిన ధాన్యం రాశులను ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. క్షేత్ర స్థాయిలో రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు. త్వరితగతిన మొత్తం ధాన్యం రైస్ మిల్లులకు పంపించే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. రైతుల ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, ఆఫ్‌లైన్‌లో కూడా ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వ చర్యలు తీసుకుందని ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగారెడ్డి రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తానన్నారు. అలాగే వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు కూడా మండలంలోని లొల్ల, వెంటూరు, కురకాళ్లపల్లి, కూర్మాపురం గ్రామాల్లో పర్యటించారు. తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీఓ కొప్పుల నరేంద్రరెడ్డిలు పర్యటించి, రైతుల ఇబ్బందులను తెలుసుకున్నారు.

క్రీడాకారుల ఎంపిక పోటీలు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలుర, బాలికల విభాగాలకు సంబంధించి జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ టీవీకే శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి 62 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారిలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి జిల్లా నుండి నలుగురు బాలికలు, నలుగురు బాలురు ఎంపికయ్యారు. వారిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రథమ సంవత్సరం విద్యార్థులు వి.వినయ్ కుమార్, పి.రామారావు జిల్లా బృందానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపికైన వారిలో బాలుర విభాగంలో ఎల్.త్రిమూర్తులు, ఎస్.దుర్గాప్రసాద్, బాలికల విభాగంలో కె.వాణి, జె.మౌనిక, ఎస్.సారా, బి.అంకిత ఉన్నారు. వారు ఈనెల 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ శ్రీకాకుళంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పాల్గొంటారని ఏపీ టెన్నికాయిట్ అసోసియేషన్ చైర్మన్ వైడీ రామారావు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు, కోచ్ కంచె రవికిరణ్, బదురు సతీంద్ర,గంజా రాజేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు యూత్ క్రిస్మస్ వేడుక

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం క్రీస్తు లూథరన్ చర్చిలో శనివారం రాత్రి 6.30 గంటలకు లూథరన్ యూత్ ఆధ్వర్యంలో వార్షికోత్సవం, యూత్ క్రిస్మస్ నిర్వహించనున్నట్టు పాస్టర్ ఆర్.ఇశ్రాయేల్, యూత్ ప్రెసిడెంట్ నూకపోయ్యి రాజేష్ (బోని), కన్వీనర్ పి.వినయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ వర్తమానికులు బ్రదర్ జోనా సామ్యేల్ కీస్టన్ సందేశాన్ని ఇస్తారని తెలిపారు. సువార్త గాయకులు బ్రదర్ నిస్సిజాన్ పాల్గొనే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీ పార్వతీ సమేత భవానీ శంకరస్వామికి లక్ష పత్రి పూజ



ప్రత్యేక అలంకరణలో పార్వతీ సమేత భవానీ శంకరస్వామి

రామచంద్రపురం రూరల్: మండలంలోని నరసాపురపుపేటలో వేంచేసియున్న శ్రీ పార్వతీ సమేత భవానీ శంకరస్వామి ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని గురువారం లక్ష పత్రి పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు కప్పగంతు సత్యనారాయణ శర్మ, మద్దిరాల శ్రీనివాస దత్తు శర్మల బ్రహ్మత్వంలో ఆలయంలో విఘ్నేశ్వర పూజ, ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష పత్రి పూజ, లక్ష కుంకుమార్చన, నవగ్రహ హోమం, సూర్య నమస్కారాలు, జ్యోతిర్లింగార్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ

- కోరుమిల్లి అయ్యప్ప ఆలయంలో ఎమ్మెల్సీ తోట పూజలు
- వల్లూరులో కుంభాభిషేకం



వల్లూరులో స్వామిని విశేషంగా అలంకరించిన పండితులు

కపిలేశ్వరపురం: గ్రామాలు ఆధ్యాత్మిక శోభతో పరవశించాయి. దేవతామూర్తుల స్మరణతో మారుమ్రోగాయి. కోరుమిల్లిలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పూజలు చేశారు. గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు, అయ్యప్ప మాలధారులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ కోరుమిల్లి గ్రామం ఆధ్యాత్మికంగా విలసిల్లుతుందన్నారు. వల్లూరులోని దేవతామూర్తుల ఆలయాల్లో గురువారం కుంభాభిషేకం పూజలు చేశారు. దేవతామూర్తులను విశేషంగా అలంకరించారు. దేశంలోని వివిధ పుణ్య నదుల నుండి తీసుకొచ్చిన జలాలతో దేవతామూర్తులకు అభిషేకం చేశారు. తులసీదళాలతో పూజలు చేశారు. గ్రామంలోని ఒక్కో ఆలయంలో ఒక్కో నది పుణ్యజలంతో అభిషేకం చేశారు. గ్రామానికి చెందిన పుణ్య దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. గ్రామానికి చెందిన ప్రముఖులు వేగుళ్ళ లీలాకృష్ణ, వల్లూరి వీరబాబు, తదితరులు దేవతామూర్తులను దర్శించుకున్నారు.

ఉత్సవాల్లో కత్తి తిప్పిన మంత్రి విశ్వరూప్



భేతాళస్వామి ఉత్సవాల్లో కత్తులు తిప్పుతున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం రూరల్: మండలంలోని కామనగరువులో గురువారం రాత్రి జరిగిన భేతాళస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ కొద్దిసేపు కత్తులు తిప్పి అక్కడి యువతను ఉత్సాహపరిచారు. ఉత్సవాల్లో నిర్వహించే పెడీ తాలింఖానా ఉత్సవాల్లో మంత్రి విశ్వరూప్ కత్తులు తిప్పుతున్న దృశ్యాన్ని గ్రామస్తులతో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులు, పార్టీ నాయకులు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా చంద్రశేఖర్, రాజులపూడి మురళి, ఈతకోట ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా ప్రదర్శనకు క్రీడలు వాహకం



క్రీడా కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): యువకుల్లో దాగి ఉన్న ప్రతిభా ప్రదర్శనకు క్రీడలు వాహకంగా దోహదపడతాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండపేట పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించిన క్రీడా సామగ్రిని ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూనే గ్రామీణ యువతలో క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. క్రికెట్, వాలీబాల్, షటిల్ తదితర క్రీడలకు చెందిన పరికరాలను ప్రభుత్వం సమకూర్చుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వదం రాజు, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ కురుపూడి భవాని, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, మండపేట, కపిలేశ్వరపురం మండలాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ద్వాదశ తీర్థాలు.. ఆధ్యాత్మిక ధామాలు

- ద్రాక్షారామ భీమేశ్వరాలయ పరిసరాల్లో కొలువైన శివాలయాలు
- మహిమాన్వితం అని భక్తుల విశ్వాసం

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా వినుతికెక్కిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ద్రాక్షారామలో శ్రీ మాణిక్యాంబా సమేత శ్రీ భీమేశ్వరస్వామివారి ఆలయ పరిసరాల్లో స్వయంగా దేవతలు శివలింగాలను ప్రతిష్ఠించారని ప్రతీతి. ఆ ప్రాంతాలను ద్వాదశ(12) తీర్థాలుగా పెద్దలు చెబుతారు. ఆ ద్వాదశ తీర్థాల మహిమను వ్యాస మహర్షికి అగస్త్య మహాముని వివరించినట్టుగా శ్రీ భీమేశ్వర పురాణంలో ఉంది. ఈ ద్వాదశ తీర్థాలు భీమేశ్వరాలయ ప్రాంగణంలోని సప్త గోదావరి తీరంలో ఏడు, సమీప గ్రామాల్లో ఐదు ఉన్నాయి. ఈ తీర్థాలలో చేసే ఆధ్యాత్మిక కార్యక్రమాలు, దానాలు, పితృ కార్యాలు మంచి ఫలితాలు ఇస్తాయని భక్తులకు విశ్వాసం. అం దుకే భీమేశ్వరుని దర్శనానికి వచ్చే భక్తులు వీటిని కూడా దర్శించుకుంటుంటారు. కార్తిక మాసం సందర్భంగా ఈ క్షేత్రాలకు భక్తుల తాకిడి పెరుగుతోంది.

మంచి ఫలితాలు ఇస్తాయి



ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ పరిసరాల్లోని 12 లింగాలు, తీర్థాలు మహిమాన్విత మైనవిగా పేరెన్నికగన్నాయి. ఈ తీర్థాలలో చేసిన జపం, హోమం, దానం, యాగం, ఉపవాసం, ఉపాసనం, పితృ కార్యాలు మంచి ఫలితాలు ఇస్తాయని పురాణ ప్రతీతి.

– మేడవరపు శ్రీనివాస చింతామణి, పురోహితుడు, వెలంపాలెం

1. యోగీశ్వరుడు యోగీశ్వరుడు – సప్త గోదావరి



భీమేశ్వరాలయ ప్రాంగణంలోని సప్త గోదావరి నది ఒడ్డున ఆగ్నేయం లో యోగులు ప్రతిష్ఠ చేసిన యోగీశ్వర క్షేత్రం.

2. సర్వ మంగళా సమేత ఇంద్రేశ్వరుడు – ఇంద్ర పుట్టము (పాతకానస్వామి)




ఇంద్రుడు ప్రతిష్ఠించిన ఇంద్రేశ్వరుడు సప్తగోదావరి నది ఒడ్డున ఆగ్నేయం వైపున ప్రతిష్ఠించిన ఇంద్ర పుట్టము.

3. సిద్ధేశ్వరీ సిద్ధేశ్వరుడు – రావివెట్టు



సిద్ధులు సప్త గోదావరి నది ఒడ్డున ఆగ్నేయం వైపున ప్రతిష్ఠించిన శివలింగం

4. కాళీశ్వరీ కాళేశ్వరుడు–కాళేశ్వర తీర్థము – సప్తగోదావ (వంటావిడి పక్కన)



భీమేశ్వరాలయ తూర్పు గోపురం ఎదురుగా సప్తగోదావరి నది అవతలి ఒడ్డున దేవతల ప్రతిష్ఠించిన కాళేశ్వర లింగం

5. కాశీ కపోతేశ్వరుడు– సప్తగోదావరి లోపల (కపోతేశ్వర తీర్థం) ఉత్తరం వైపున



భీమేశ్వరాలయానికి ఈశాన్య భాగంలో సప్తగోదావరి నది ఒడ్డున దేవతల ప్రతిష్ఠించబడిన కపోతేశ్వరుడు (కపోతేశ్వర తీర్థం).

6. వేదవతి సమేత సప్తకోటి రామలింగేశ్వరుడు – వీ ఘ్నేశం (ఇంటర్ స్టేడియం వద్ద)



భీమేశ్వరాలయాని కి ఉత్తర దిక్కున శ్రీరామచంద్ర స్వామి ప్రతిష్ఠించిన రామలింగేశ్వరుడు

7. ఉమా సోమేశ్వరుడు – సోమగుండం



భీమేశ్వరాలయానికి వాయవ్యం దిక్కున చంద్రుడు ప్రతిష్ఠించిన సోమేశ్వర లింగం

8. శ్రీ భద్రకాళి సమేత వీరభద్రేశ్వరుడు – వీరభద్రేశ్వర తీర్థం (వెలంపాలెం రోడ్డు)



భీమేశ్వరాలయానికి నైరుతి దిక్కున దేవతలు ప్రతిష్ఠించిన వీర భద్రేశ్వరుడు

9. శ్రీ యమేశ్వరీ యమేశ్వరుడు – యమగుండం (వెలంపాలెం రోడ్డు)



భీమేశ్వరాలయానికి నైరుతి దిక్కున దేవతలు ప్రతిష్ఠించిన యమేశ్వరుడు

10. శ్రీ శారదా బ్రహ్మేశ్వరుడు – బ్రహ్మగుండం – వెలంపాలెం



భీమేశ్వరాలయానికి పశ్చిమ దిక్కున బ్రహ్మ ప్రతిష్ఠించిన బ్రహ్మేశ్వరుడు

11. శ్రీ కౌమారీ కౌమారేశ్వరుడు (కుక్కుటేశ్వరుడు)



కుక్కుటేశ్వర గుండం–వెలంపాలెం భీమేశ్వరాలయానికి పశ్చిమ దిక్కున దేవతలు ప్రతిష్ఠించిన కుక్కుటేశ్వరుడు.

12. శ్రీ మహేశ్వరీ మహేశ్వరుడు– మహాదేవ గుండం–ఆకుల వారి వీధి



భీమేశ్వరాలయానికి దక్షిణ దిక్కున దేవ తలు ప్రతిష్ఠించిన మహే శ్వరుడు.

కంటి పరీక్షా కేంద్రం ప్రారంభం



ఏడిదలో కంటి పరీక్షలను పర్యవేక్షిస్తున్న పురుషోత్తం తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం ఏడిద గ్రామం రథం సెంటర్లో గురువారం హైదరాబాద్‌కి చెందిన ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల అనుబంధ కంటి పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామానికి చెందిన నామాల పురుషోత్తం హైదరాబాద్ సిరిబద్దారు. ఆయన సౌజన్యంతో కేంద్రం ఏర్పాటు చేశారు. సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పురుషోత్తం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సామాన్య ప్రజలకు కంటి వైద్య సేవలను అందించడంలో ఎల్వీ ప్రసాద్ వైద్య పరిశోధన కేంద్రం విశేష కృషి చేస్తుందన్నారు. ఆ లక్ష్య సాధనలో భాగస్వామిని కావడం ఆనందంగా ఉందన్నారు. ఎల్వీ ప్రసాద్ ఐ విజన్ సెంటర్ డైరెక్టర్ నిరంజన్, ఏపీ రీజియన్ అడ్మినిస్ట్రేటర్ వాసుబాబు మాట్లాడుతూ అనుపత్రి సేవలను ఏడిద పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. సొంత గ్రామంపై మమకారాన్ని చాటుకున్న పురుషోత్తంను సర్పంచ్ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుపులేటి నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అభినందించారు. కేంద్రం నిపుణులు గ్రామానికి చెందిన వారికి ఆధునిక యంత్రాలతో కంటి పరీక్ష చేశారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త రామలింగారెడ్డి, బలుసు వెంకట్రావు, చిలుకూరి సత్యనారాయణ, కొసగొట్ల సత్తిబాబు, కురుపూడి రాంబాబు, మేడపాటి రామలింగారెడ్డి, గ్రామ కార్యదర్శి ఉండమట్ల వీరాజు పాల్గొన్నారు.

హరిహర మహాయజ్ఞానికి విస్తృత ఏర్పాట్లు



యానాం గౌతమి గోదావరి తీరంలో మహాయజ్ఞానికి చేస్తున్న ఏర్పాట్లు

యానాం: గౌతమీ గోదావరి తీరంలో పవిత్ర కార్తిక మాసం పురస్కరించుకుని ఈ నెల 10న ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న హరిహర మహాయజ్ఞానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక ఫెర్రీ రోడ్‌లో వేలాది మంది భక్తులు కోసం సుమారు 10 ఎకరాల ప్రాంగణంలో చేపడుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఈ మహాసంకల్పంతో ఈ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. మహాయజ్ఞానికి యానాం నుంచే కాకుండా ఆంధ్రా ప్రాంతం నుంచి సైతం ప్రజాప్రతినిధులను, ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే అందరికీ ఆహ్వానపత్రాలు పంపామన్నారు. ఈ నెల 10వ తేదీ ఉదయం ఆరు గంటల నుంచే గణపతిపూజ, పుణ్యాహవాచనం, ఋత్విక్ వరుణ, దీక్షా ధారణ పూజలు ఉంటాయన్నారు. 11 గంటల నుంచి మహాయజ్ఞానికి సంబంధించిన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా నేపాల్ నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన రుద్రాక్షలతో అర్చన చేసి వాటిని భక్తులకు పంపిణీ చేస్తామన్నారు. శాంతికళ్యాణం, జ్యోతిర్లింగార్చన, గోదావరి హారతి అనంతరం ప్రసాద వితరణ ఉంటుందన్నారు.